క్లుప్తంగా

నరేశ్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు తాళ్లపెల్లి నరేశ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. స్టేట్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఏ స్టడీ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను నరేశ్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ఆచార్యులు పి.సమ్ములాల్ పర్యవేక్షణలో నరేశ్ తన పీహెచ్‌డీని పూర్తిచేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో జూన్ 1న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కొత్తూరు రోడ్, తోట బడి, భగత్‌సింగ్ కాలనీ, గోపాల్‌రావు బిల్డింగ్, హనుమాన్‌నగర్, యాదవనగర్, పాలజెండా, రెడ్డికాలనీ, బుద్ధనగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

పేషెంట్‌పై దురుసుగా ప్రవర్తించిన డాక్టర్

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఆస్పత్రిలో పని చేస్తున్న డాక్టర్ హరిబాబు శనివారం ఒక పేషెంట్ పట్ల దురుసుగా ప్రవర్తించారు. బాధితురాలు రైల్వే పెన్షనర్ సాధినేని పద్మ విలేకర్లకు తెలిపిన వివరాల ప్రకారం.. తాను చెస్ట్ పెయిన్‌తో రైల్వే ఆస్పత్రికి వెళ్లితే డ్యూటీలో ఉన్న డాక్టర్ హరిబాబు తనతో పాటు నా వెంట వచ్చిన అటెండెంట్ పట్ల దురుసుగా మాట్లాడారు. ఎందుకు సార్ అలా మాట్లాడుతున్నారని అడుగగా అలానే మాట్లాడుతానని దుర్భాషలాడారని ఆమె తెలిపింది. రైల్వే పెన్షనర్స్‌పై చిన్న చూపుచూస్తున్న డాక్టర్ హరిబాబుపై రైల్వే అధికారులు చర్య తీసుకోవాలని ఆమె కోరారు. రైల్వే డాక్టర్ హరిబాబును సెల్‌ఫోన్‌లో వివరణ అడుగగా తాను పేషెంట్‌తో మాట్లాడి ట్రీట్‌మెంట్ ఇచ్చానని ఆయన సమాధానం చెప్పారు.

యాదగిరి కుటుంబాన్ని ఆదుకోవాలి

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఇనిస్టిట్యూట్‌లో బాయ్‌గా తాత్కాలిక పద్ధతిన 23 ఏళ్లుగా చాలీచాలని జీతంతో పనిచేస్తున్న ఎస్.యాదగిరి(47) అనారోగ్యంతో శనివారం మృతి చెందగా ఆయన కుటుంబాన్ని రైల్వే అధికారులు ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. గత ఏడాది నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

విత్తనాల షాపుల్లో తనిఖీ



విత్తనాల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని విత్తనాల షాపులను శనివారం మడికొండ సీఐ కిషన్ ఎస్సై రాజ్‌కుమార్‌తో పాటు ఏడీఏ రాజ్‌కుమార్, కాజీపేట వ్యవసాయధికారి సంతోష్‌లు గ్రామంలోని విత్తనాల షాపులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విత్తనాల నాణ్యత ప్రమాణాలను విక్రయించిన విత్తనాలను ఎంఆర్‌పీకి అమ్ముతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట అధికారులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రాణి అహల్యాబాయి జయంతి వేడుకలు



ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటలో చిలువేరు రాజేందర్ ఆధ్వర్యంలో రాణి అహల్యాబాయి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాసు శిల్ప, కర్నె రవీందర్, అనిల్, మురళీకృష్ణ, హరిశంకర్, దీనదయాల్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ఖిలా వరంగల్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం ఖుష్‌మహల్ ప్రాంగణంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పరేడ్ నిర్వహణ కోసం ఏర్పాట్లు చేపట్టారు. వీటిని పోలీస్ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ఆర్ఐ ఆనంద్‌కుమార్, ఎస్సైలు సురేష్, శ్రీకాంత్‌లు ఉన్నారు.

ప్రమాదాలకు కేరాఫ్

కడిపికొండ కల్వర్టు
- నిత్యం ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- స్పీడ్‌కు బ్రేకర్ లేకపోవడంతో దూసుకుకెళ్తున్న వాహనాలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి..



కల్వర్టు వద్ద బోల్తాపడిన బొగ్గు లారీ (ఫైల్)



ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న కల్వర్టు

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం కడిపికొండ గ్రామం రాజీవ్‌గృహకల్ప సముదాయం కూతవేటు దూరంలోని ఖమ్మం బైపాస్ రోడ్డుకు అనుకుని ఉన్న కల్వర్టు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారిపోయింది. కాజీపేట మీదుగా ఖమ్మంకు, వరంగల్, హంటర్‌రోడ్డు, కడిపికొండ, భట్టుపల్లి, కొత్తపల్లి, అమ్మవారిపేట తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు నిత్యం బైపాస్ రోడ్డుగా రహదారిపై ప్రయాణం కొనసాగిస్తున్నారు. దీంతో నిత్యం భారీ వాహనాలతో పాటు ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు రయ్ రయ్ మంటు దూసుకుపోతున్నాయి.

స్పీడ్‌కు బ్రేక్ లేదు

కాజీపేట టు ఖమ్మం బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న కల్వర్టు మలుపు వద్ద ఏపుగా పెరిగిన చెట్లు పెరిగిపోవడంతో ఎదరుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనాలు ఢీకొని పమ్రాదాలు చోటు చేసుకుంటున్నాయి. కల్వర్టుకు ఎటు వైపు కూడా స్పీడ్ బ్రేకర్లు, బారికేడ్‌లు కూడా లేకపోవడంతో వాహనాల స్పీడ్‌కు బ్రేక్ పడడం లేదు. ఇటీవల కారును తప్పించబోయి కర్ణాటకు చెందిన బొగ్గు లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్లకు తీవ్రగాయాలయ్యాయి, కడిపికొండకు చెందిన ఓ కారు కల్వర్టు సమీపానికి రాగా ఎదురుగా వస్తున్న బోర్‌వెల్ వాహనం ఢీ కొట్టింది. ద్విచక్రవాహనదారుడు రాజీవ్‌గృహకల్ప వైపు ప్రయాణిస్తుండగా కాజీపేట వైపు వెళ్తున్న కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇలా ప్రతి రోజు ప్రమాదాలు చోటు చేసుకుండడంతో ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో అయితే మరీ దారుణం, వీధి దీపాలు లేక వాహనాల వెలుగులో భయంభయంగా ప్రయాణం చేస్తున్నారు. అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.

విత్తన వినియోగంపై చైతన్య సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఏఓ రవీందర్‌రెడ్డి

ఖిలా వరంగల్: వరంగల్ స్టేషన్‌రోడ్‌లో వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలపై చైతన్య సదస్సు శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల వ్యవసాయ అధికారి రవీందర్‌రెడ్డి హాజరై కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు, ప్యాకెట్‌పై ముద్రించిన సమాచారం, మొలక, నాణ్యత, చిరునామా, పలు రకాల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వినియోగ మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, హైకోర్టు అడ్వకేట్ యశ్వంత్ కుమార్, న్యాయవాదులు రంగరాజు ఆనంద్‌రావు, సీసీఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావులు రంజిత్‌కుమార్, శ్యాంసుందర్, దామెర శ్యాంకుమార్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి



బడిబాట పాటను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు

విద్యారణ్యపురి : ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని పీఆర్‌టీయూ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో లష్కర్‌బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్.రాములు రచించిన పిలుస్తుండి బడిబాట పాటను రాములు, పీఆర్‌టీయూ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో ప్రజాప్రతినిధులను కలుపుకొని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. రాములు రచించిన విద్యార్థుల్లారా ప్రభుత్వ పాఠశాల పూదోటరా అనే పాట అద్భుతంగా ఉందని ఆయనను అభినందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి, వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఈదునూరు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జయపాల్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జాలి రాఘవరెడ్డి పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

మతోన్మాదులతోనే దేశానికి ప్రమాదం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఖిలా వరంగల్: మతోన్మాదులతోనే దేశానికి ప్రమాదకరమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో శనివారం జరిగిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తులపైనే ఉండటంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో ప్రజాసమస్యలు పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలను సీపీఐ నిర్వహించిందని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి మాట్లాడుతూ జూలై 30, 31 వరంగల్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శులు ఎస్‌కే బాషుమియా, ప్రసాద్, గన్నారపు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వడ్డేపల్లి చెరువులో గుర్తుతెలియని మృతదేహం



గుర్తుతెలియని మృతదేహం

కాజీపేట : కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి చెరువులో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. వడ్డేపల్లి చెరువులో ఓ వ్యక్తి మృతదేహం నీటిలో తేలియాడుతున్నట్లుగా గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సాయంతో బయటకు తీయించి ఎంజీఎం మార్చురీకి తరలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి వయస్సు దాదాపు 50 నుంచి 60 ఏళ్ల వరకు ఉంటుందని, వివరాలు తెలిస్తే 8712-85009 లేదా 87126-85123 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాజీపేట మండలం రాంపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాంపేట గ్రామానికి చెందిన నక్కల భిక్షపతి(43)ఈ నెల 26న ఉదయం 8 గంటలకు ఇంట్లో నుంచి పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. 10 గంటలకు తల్లి గౌరమ్మకు కడుపునొప్పి భరించలేక గడ్డి మందు తాగినట్లు తెలిపాడు. దీంతో అతడి తల్లి చికిత్స నిమిత్తం ఆటోలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం మే 28న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిషన్ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇంట్లో మంటలు



మంటలను ఆర్పివేస్తున్న మడికొండ పోలీసులు

మడికొండ: ప్రమాదవశాత్తు మంటలు అంటుకోగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మడికొండ పోలీసులు స్పందించి మంటలను ఆర్పివేసిన సంఘటన మడికొండలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండ ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన జన్ను అనసూర్య ఇంట్లో దేవుడి పటం ముందు దీపం పెట్టడంతో ప్రమాదవశాత్తు పక్కన ఉన్న సామాన్లకు మంటలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు మడికొండ పోలీసులకు సమాచారం అందించగా సీఐ పోలీసు సిబ్బందితో వచ్చి మంటలను ఆర్పివేసి వృద్ధురాలిని కాపాడారు. తక్షణం స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పినట్‌లైందన్నారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పక్కనే గ్యాస్ సిండర్ ఉండగా ఎలాంటి ప్రమాదం సంభవించలేదన్నారు.

పాడి ఆవులు పట్టివేత.. ముగ్గురిపై కేసు

ఖిలా వరంగల్: బక్రీద్ పర్వదినం నేపథ్యంలో అక్రమంగా పాడి ఆవులను తరలిస్తున్న వాహనాన్ని శనివారం వరంగల్ లేబర్ కాలనీ ఏరియాలో మిల్స్ కాలనీ పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మూడు ఆవులతో పాటు వాటిని వాహనంలో తరలిస్తున్న సిద్దిపేటకు చెందిన ఇద్దరు, కరీమాబాద్ చెందిన మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

- 400 మంది రోగులకు చికిత్సలు



శిబిరంలో చికిత్స చేస్తున్న వైద్యులు

ఎంజీఎం : వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆరుషి ఆస్పత్రి యాజమాన్యం అజిత్ మహ్మద్ సౌజన్యంతో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన బాధితులకు టూడీ ఎకో, ఈసీజీ, బీపీ, షుగర్ వంటి చికిత్సలు నిర్వహించడంతో పాటు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ నుంచి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని కోరగానే అంగీకరించిన డాక్టర్ అజిత్ మహమ్మద్, భగీరథ, సాయిరాం, నాగేంద్రబాబు, రాజుకుమార్, సునీల్, నవ్య, సంపత్‌కుమార్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు నాగేంద్రబాబు, గందె శ్రీనివాస్ గుప్తా, ఓలం సదాశివుడు, అల్లాడి బద్రి, పరమేశ్, రఘుబాబు, నారాయణ, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పర్వతగిరి : మండలంలోని జమలాపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు సంపత్ శనివారం తాటి చెట్టు మీద నుంచి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. కులవృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కిన ఆయన ప్రమాదవశాత్తు జారిపడడంతో కాలు, నడుం విరిగాయి. కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు.

పంట మార్పిడితో తెగుళ్ల నివారణ

శాయంపేట : పంట మార్పిడితో తెగుళ్లను నివారించవచ్చని కేవీకే మామునూర్ వెటర్నరీ సైంటిస్ట్‌లు డాక్టర్ జె.సాయికిరణ్, డాక్టర్ ఎం.సురేష్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు వస్తాయని అన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం, కోళ్ల పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా వాటి ఎరువులతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. రసాయనాల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సమీకృత వ్యవసాయ విధానం పాటించినట్లయితే సంవత్సరం పొడవునా ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. డ్రిప్పు పద్ధతిలో నీటి యాజమాన్య పద్ధతి పాటించినట్లయితే నీటి వృధాని అరికట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్ రీసెర్చ్ హైదరాబాద్ సాయిచంద్, ఏఓ గంగాజమున, రైతులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- నగర మేయర్ గుండు సుధారాణి



బోట్లను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

న్యూశాయంపేట : వర్షాకాలం నేపథ్యంలో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డీఆర్‌ఎఫ్) సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని సర్కిల్ కార్యాలయ ఆవరణలోని డీఆర్‌ఎఫ్ కార్యాలయంతో పాటు నర్సరీని క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో ఉన్న బోట్లను పరిశీలించారు. నర్సరీని సందర్శించి ఇందులో పెంచుతున్న మొక్కల రకాలను అడిగి తెలుసుకున్నారు. రాబోవు వనమహోత్సవం సందర్భంగా ఎక్కువ మొత్తంలో మొక్కలను పెంచాలని అధికారులకు సూచించారు. సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఎస్ఈ, సీపీలు శ్రీనివాస్, రవీందర్ వాడేకర్, ఈఈలు రవికుమార్, మాధవిలత, ఏసీపీ రజిత, డీఈ రాజ్‌కుమార్ టీపీఎస్ రోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర విభాగాలకు నిరంతర విద్యుత్

- టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఎస్ఈ పి.మధుసూదన్ రావు



ఎంజీఎంలో ఆటో జనరేటర్ కండీషన్‌ను తనిఖీ చేస్తున్న గౌతంరెడ్డి, మల్లికార్జున్

హన్మకొండ: అత్యవసర విభాగాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఎస్ఈ పి.మధుసూదన్ రావు తెలిపారు. ముఖ్యంగా ఆస్పత్రులు, మిషన్ భగీరథ, చేనేత పరిశ్రమలు, ఇతర అత్యవసర సేవలకు సంబంధించిన సర్వీసులకు ఈ వేసవిలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ అందించినట్లు గుర్తుచేశారు. ఈ క్రమంలో ఒక్కో ముఖ్యమైన సర్వీసుకు డీఈ, ఏడీఈ స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించి, సర్వీసులను నిత్యం తనిఖీ చేసి ఎలాంటి సమస్యలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

ఆస్పత్రుల్లో విద్యుత్ సరఫరా తనిఖీలు

వరంగల్‌లోని కేఎంసీ సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి, ఎంజీఎం ఆస్పత్రుల్లో విద్యుత్ సరఫరా జరుగుతున్న తీరును టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గౌతంరెడ్డి తనిఖీ చేశారు. అంతరాయం లేని విద్యుత్ అందించడానికి చేసిన ఏర్పాట్లు, ఎంజీఎంలోని ఆటో జనరేటర్ వర్కింగ్ కండీషన్‌ను పరిశీలించారు. దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్, ఏడీఈ టి.సురేష్, ఏఈలు వి.రవీందర్, కె.తిరుపతి, లైన్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చయ్య గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : ఉద్యోగులు అంకితభావం, నిబద్ధతతో తమ విధులను నిర్వర్తించినప్పుడే గుర్తింపు ఉంటుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడి అన్నారు. కేయూ క్లాస్ ఫోర్త్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు, ఆర్ట్స్ అండ్ సైన్స్‌కాలేజీలో ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ పొందిన ఎండి.అబ్దుల్ షుకూర్‌ను శనివారం సాయంత్రం కేయూలోని పరిపాలనా భవనంలో సెనేట్ హాల్‌లో రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంతో కలిసి సన్మానించారు. అబ్దుల్ షుకూర్‌కు దుశాలువా కప్పి జ్ఞాపికను అందజేసి పూల బొకే అందజేసి అభినందించారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం

న్యూశాయంపేట: బల్దియాలో దీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తోట భిక్షపతి,(శానిటరీ జవాన్), ఎండీ.గౌస్ (అటెండర్, బోర్ వెల్స్), ఎర్ర సరోజన (పీహెచ్ వర్కర్)ను కార్యక్రమంలో బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజారెడ్డి, ఉద్యోగులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు రమేష్, వర్కింగ్ అధ్యక్షుడు రాజారపు భాస్కర్, గౌరవ అధ్యక్షుడు ఏల్పుల ధర్మరాజు, నాయకులు స్వామి, పర్కాల ఆదాం, ఎల్లన్న, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

హసన్‌పర్తి : పదవీ విరమణ పొందిన తర్వాత సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన కామాక్షిని శనివారం ఘనంగా సన్మానించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కోమల్‌రెడ్డి, ఏఓ డాక్టర్ రమేష్‌రెడ్డి, ప్రొఫెసర్ సెంథిల్ మురుగన్, డాక్టర్ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేసిన సుబ్రహ్మణ్యేశ్వరరావు



హన్మకొండ : సుబ్రహ్మణ్యేశ్వర రావు, సుగుణ దంపతులను సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించిన వ్యక్తి తెలంగాణ పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ టీజీ ఎన్పీడీసీఎల్ శాఖ కార్యదర్శి నార్ల సుబ్రహ్మణ్యేశ్వర రావు అని వక్తలు కొనియాడారు. శనివారం హనుమకొండ వడ్డెపల్లి 100 ఫీట్ల రోడ్‌లోని ఫంక్షన్ హాల్‌లో టీజీ ఎన్పీడీసీఎల్ కాజీపేట ఏడీఈ నార్ల సుబ్రమణ్యేశ్వర రావు పదవీ విరమణ అభినందన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా అసోషియేషన్‌ల నాయకులు, అధికారులు మాట్లాడుతూ తెలంగాణ పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకునిగా ఇంజనీర్ల హక్కుల కోసం పోరాడారన్నారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యేశ్వర్‌రావు, సుగుణ దంపతులను ఎస్ఈ, డీఈలు, ఏఈలు, ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛాలు, మొక్కలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, చీఫ్ ఇంజనీర్ వెంకట రమణ, రిటైర్డ్ సిజిఎం మోహన్ రావు, డీఈలు విజేందర్ రెడ్డి, జి.సాంబ రెడ్డి, సామ్యా నాయక్, ఎస్ ఏ ఓ నవీన్ కుమార్, ఏడీఈలు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కోసం 25 ఎకరాల మేరకు స్థలం అవసరం ఉండగా, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రెండు రోజులుగా రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాలు పరిశీలించారు. మామునూర్, హసన్‌పర్తి మండలం భీమారంలోని కొచ్చెరు, పెగడపల్లిల్లో భూములను పరిశీలించారు. భీమారంలోని సర్వే నంబర్ 70లో స్కూల్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు ఎమ్మెల్యే భావించారు. ఎన్ని ఎకరాల స్థలం అందుబాటులో ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని ఆదేశించారు. తహసీల్దార్ చల్లా ప్రసాద్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు కిరణ్, హరిబాబు, గడ్డం శివరాంప్రసాద్, నాయకులు ఐలయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

టీచర్ల సర్దుబాటును ఉపసంహరించుకోవాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి



మాట్లాడుతున్న నన్నబోయిన తిరుపతి

విద్యారణ్యపురి: టీచర్ల సర్దుబాటుకు జారీచేసిన ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. హనుమకొండలోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పదిలోపు విద్యార్థులుంటే ఒక టీచర్, 60లోపు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు, 90లోపు ఉంటే ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాలనడం సరి కాదన్నారు. ఇది అసంబద్ధమైన నిబంధన అని ఆయన విమర్శించారు. బడిబాట కార్యక్రమం పూర్తయ్యాకనే టీచర్ల సద్దుబాటు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో టీపీటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ,రాష్ట్ర కౌన్సిల ర్ రఘుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి, జిల్లా కార్యదర్శి రమేష్, బాధ్యులు చంద్రగిరి లక్ష్మయ్య, భిక్షపతి, పాలకుర్తి సదా నందం, ఎల్. భాస్కర్ పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు.. ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టు

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి కలెక్టర్లకు అధికారమిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విడుదల చేసిన ఉత్తర్వులు ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టులా మారాయని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు యాకయ్య, ప్రధాన కార్యదర్శి గోవిందరావు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తూ నే మరోవైపు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కు దింపునకు ఉత్తర్వులు జారీచేయడం ఏమిటని ప్రశ్నించారు. టీచర్ల సర్దుబాటు చేస్తే ప్రాథమిక పాఠశాలలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒక తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.